రేపు ప్రజావాణి రద్దు

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కుటుంబ సర్వే నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదుల విభాగాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ రాజార్షిషా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నేటి నుంచి నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే-సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సందర్భంగా రద్దు చేశామన్నారు. ప్రజలు దీనిని గమనించి కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని తెలిపారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజలు సిబ్బందికి సహకరించి సమగ్ర సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



ఔత్సాహికుల కోసమే ముద్ర

- మూడు రకాలుగా ముద్ర రుణాలు
- స్వయం ఉపాధి పొందే వారికే లాభం

7



ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోథ్‌లో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ దిష్టిబొమ్మ దహనం

- సీఎం ఫ్లెక్సీలను తొలగించడంపై ఆందోళనలు

6



బాజాభజంత్రీలతో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్థులు

హాకీ విజేతలకు సన్మానం

- రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ టోర్నమెంట్‌లో బరంపూర్ పాఠశాలకు ప్రథమ బహుమతి

6



- ఇటీవల ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో పట్టుబడిన రేషన్ బియ్యంతో పోలీసులు (ఫైల్)



- జిల్లాలో ఆగని అక్రమ రేషన్ బియ్యం దందా
- దళారులకు అమ్మేసుకుంటున్న లబ్ధిదారులు
- చెక్‌పోస్టుల వద్ద కొరవడుతున్న నిఘా
- సరిహద్దులు దాటిస్తున్న అక్రమార్కులు
- తేలికగా తీసుకుంటున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

రేషన్ బియ్యం తింటలేరు!

ఆదిలాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నో పోషక విలువలతో కూడిన రేషన్ బియ్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగానే పంపిణీ చేస్తున్నా కొంతమంది లబ్ధిదారులు తీనేందుకు ఇష్టపడడం లేదని తెలుస్తోంది. ప్రతీనెల యధావిధిగా రేషన్ బియ్యాన్ని తీసుకుంటున్న లబ్ధిదారులు క్వింటాళ్ల కొద్ది పోగుచేస్తూ అమ్మేసుకుంటున్నారు. దీంతో రేషన్ బియ్యం అక్రమ దందాకు అడ్డుకట్ట పడడంలేదు. ఈ యేడు అక్టోబరు 31 వరకు వెయ్యి క్వింటాళ్లకు పైగానే పట్టుబడినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. కొందరు దళారులు గ్రామాల్లో రేషన్‌బియ్యాన్ని సేకరించి పెద్దమొత్తంలో సరిహద్దులు దాటిస్తూ అమ్మేసుకుంటున్నారు. ఇలా జిల్లాలో తరుచూ రేషన్ బియ్యం అక్రమ రవాణా వెలుగు చూస్తూనే ఉంది. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రాయితీ బియ్యాన్ని తీసుకోవడం దళారులకు అమ్మేసుకోవడం లబ్ధిదారులకు అలవాటుగానే మారింది. సేకరించిన రేషన్ బియ్యాన్ని దళారులు రహస్యంగా సరిహద్దు మండలాలైనా తలమడుగు, బోథ్, బేల, నార్నూర్ మండలాల మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. మహారాష్ట్రలోని బోరి, కిన్వట్, నాగ్‌పూర్, చంద్రపూర్, పాండ్రకోడ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇటీవల జిల్లాకేంద్రంలోని తిర్పెల్లి వద్ద 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాయి. ఇలా జిల్లాలో ఎక్కడో ఓ చోట నిత్యం రేషన్‌బియ్యం పట్టుబడుతున్న దాఖలాలున్నాయి. అడపదడపగా పోలీసులు చేపడుతున్న తనిఖీల్లోనే రేషన్ బియ్యం పట్టుబడుతున్నాయి. కానీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్రమ రేషన్ బియ్యం రవాణాపై దృష్టి సారించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

• రహస్య ప్రాంతాల్లో డంపింగ్

గ్రామాల్లో తమ ప్రతినిధుల ద్వారా రేషన్‌బియ్యాన్ని సేకరిస్తున్న దళారులు రహస్య ప్రాంతాల్లో భారీగా డంపింగ్‌లు చేస్తూ అదును చూసి సరిహద్దులు దాటిస్తూ అమ్మేసుకుంటున్నారు. తాంసి బస్టాండ్, రాంపూర్ పరిసర ప్రాంతాల్లోని మూతబడిన జిన్నింగ్ ఫ్యాక్టరీలో రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి పట్టపగలే తలమడుగు లక్ష్మీంపూర్ చెక్‌పోస్టు మీదుగా సరిహద్దులు దాటిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదంతా అధికారులకు తెలిసిన అటువైపు కన్నెత్తి చూడడం లేదంటున్నారు. కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు ప్రతీనెల ముట్టచెప్పడంతో అధికారులు మౌనంగానే ఉండిపోతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. డీలర్లతోనే సంబంధాలు పెట్టుకుంటున్న వ్యాపారులు ప్రతీనెల రేషన్‌బియ్యాన్ని సేకరించి భారీ మొత్తంలో అక్రమదందాకు ఎగబడుతున్నారు. వీరికి ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, బోథ్ మండలాల్లోను నిల్వ కేంద్రాలు ఉన్నట్లు చెబుతున్నారు. సాధారణంగా అక్రమదందాలన్నీ రాత్రివేళల్లోనే కొనసాగుతాయి. కానీ జిల్లాకేంద్రంగా సాగే రేషన్‌బియ్యం దందా పట్టపగలే దర్జాగా సాగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు.

• మహారాష్ట్రలో డిమాండ్

మహారాష్ట్రలో రేషన్ బియ్యానికి భారీ డిమాండ్ ఉండడంతో ముందే ఆర్డర్లను సేకరిస్తూ అక్రమ బియ్యం రవాణాను కొనసాగిస్తున్నారు. పట్టుబడిన వ్యాపారులపై పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నామమాత్రంగానే 6ఏ కేసులు పెట్టి వదిలేయడంతో రేషన్ అక్రమదందా మళ్లీ పునరావృతమవుతూనే ఉంది. ఈ దందాలో ఆరి తేరిన వ్యాపారులు ఉన్నతాధికారులతో సన్నిహితంగా ఉంటూ తమదందాకు అడ్డూ అదుపు లేకుండా చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. సేకరించిన రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలించి కిలో రూ.18 నుంచి రూ.25 వరకు అమ్మేసుకుంటున్నారు. ఒక్కో కిలో వెంట ఖర్చులన్నీ పోను రూ.6 నుంచి (...మిగతా 6వ పేజీలో)

పోలీసుల సహకారంతో పట్టుకుంటున్నాం..

• వాజీద్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, ఆదిలాబాద్

జిల్లాలో జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ దందాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసుల సహకారం తీసుకుంటున్నాం. సిబ్బంది సమగ్ర కుటుంబ సర్వేలో ఉన్నారు. దీంతో కొంత పర్యవేక్షణ కష్టంగానే మారింది. పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయలేకపోతున్నాం. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.



సర్వే పకడ్బందీగా చేపట్టాలి

• కలెక్టర్ రాజర్షిషా

గుడిహత్నూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సామాజిక సర్వేపై నిర్లక్ష్యం వహించకుండా పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం మండలంలో సర్వే ఇంటింటికి వేసిన స్టిక్కర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేఫారంలో వివరాలు తప్పులు నమోదు చేయవద్దని సూచించారు. సిబ్బందికి ఎలాంటి సందేహాలున్నా సూపర్‌వైజర్‌లను సంప్రదించాలన్నారు. సేకరించిన డాటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఇంటింటి సమగ్ర సర్వేకు వచ్చే అధికారులు సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో అబ్దుల్‌హై, అధికారులు తదితరులు ఉన్నారు.



సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

సిరికొండ : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజలు తమ వివరాలు అందించి సహకరించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజార్షిషా అన్నారు. శనివారం సిరికొండ మండలంలోని సుంకిడి గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. సిరికొండ మండలం నుంచి ఇంద్రవెల్లి మండలంలోనే విలీనం చేయాలనే డిమాండ్‌తో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేని శుక్రవారం మల్లాపూర్ గ్రామంలో గ్రామస్తులు అడ్డుకున్నారని మండల స్థాయి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళగా... ఈ విషయమై ఇది వరకే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది అని తెలిపారు. సర్వేని యథావిధిగా కొనసాగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ తుకారాం, ఎంపీవో సంతోష్, ఐకేపీ ఏపీఎం సంతోష్, ఆర్‌ఐ విలాస్, ఎన్యూమరేటర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్వే సమాచారం నమోదు చేయండి

• వీడియోకాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం బట్టి

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి) : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వేపై శనివారం క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానీయా, జిల్లా కలెక్టర్లతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షిషా పాల్గొన్నారు. ఇళ్ల జాబితా (హౌస్‌లిస్టింగ్) పూర్తి చేసుకుని నేటి నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న సందర్భంగా కలెక్టర్లు ఎన్యుమరేటర్లు పకడ్బందీగా సమగ్ర సర్వే సమాచారం నమోదు చేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ శనివారం నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న సందర్భంగా ప్రజలకు అనేక సందేహాలు వస్తుంటాయని నివృత్తి చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఎలాంటి సందేహాలున్నా ఎన్యుమరేటర్లు కలెక్టర్ల దృష్టికి తేవాలని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలు పడకుండా ఎన్యు మరేటర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ప్రజల పట్ల ఎన్యూమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలని, మంత్రులు, ఎమ్మెల్యేలు సర్వేలో భాగస్వాములయ్యేలా చూడాలని తెలిపారు. ప్రజల సమగ్ర సమాచారం సేకరణ వల్ల అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయడానికి దోహదపడతాయన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజార్షిషా సీపీవో, డీపీవో, డీఈవో, మున్సిపల్ కమిషనర్, మండల సర్వే టీమ్స్ ఎంపీడీవో, సీ, సూపర్‌వైజర్, ఎన్యుమరేటర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

అధికారులు పర్యవేక్షణ చేయాలి : కలెక్టర్

కలెక్టర్ మాట్లాడుతూ సర్వే కోసం జారీచేసిన బుక్‌లెట్‌లో మొత్తం 56 అంశాలున్నాయని ఎలాంటి అనుమానాలు, సందేహాలకు తావులేకుండా ప్రజల నుంచి ఖచ్చితమైన సమాచారం సేకరణలో నమోదు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియను సూపర్‌వైజర్లు, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్వే ప్రక్రియను నిబద్ధతతో, ఎలాంటి పొరపాట్లకు అస్కారం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ తదితరులున్నారు.

ఓటుహక్కు వజ్రాయుధం

• అదనపు కలెక్టర్ శ్యామల

భీంపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థలు భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. ఎన్నికల సంఘం కల్పించిన ప్రత్యేకఓటరు నమోదు కేంద్రాన్ని ఆమె పరిష్కరించారు. ఈ సందర్భంగా శ్యామల దేవి మాట్లాడుతూ గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటు నమోదు చేసుకోవాలని అన్నారు. భీంపూర్ తహసీల్దార్ నలంద ప్రియతో కలిసి మండలంలోని పిప్పల్‌కోటిలో ఏర్పాటుచేసిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయితీ వద్ద అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, అంగన్‌వాడీలు ధోనిపెల్లి వెంకటమ్మ పాల్గొన్నారు.

పటిష్టంగా సర్వే నిర్వహించండి

బజార్‌హత్నూర్, నవంబరు 9: జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను ప్రారంభించిన పంచాయతీ కార్యదర్శులందరూ సర్వేను పటిష్టంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు టీపీఎస్‌సీఎఫ్ ఉపాధ్యక్షుడు సునీల్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వం పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంటు ఆధ్వర్యంలో రాష్ట్రంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులతో ఈ సర్వే చేపిస్తున్నందున ప్రతి పంచాయతీ కార్యదర్శి పటిష్టంగా సర్వేను నిర్వహించి పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంటుకు మంచి పేరును తీసుకురావాలన్నారు. 30 గ్రామ పంచాయతీల పరిధిలో సర్వే ప్రాంభించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.

రిమ్స్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 09 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్‌లోని రిమ్స్‌ను ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న రోగులకు అందుతున్న వైద్యం తీరును తెలుసుకుని స్వయంగా ఎమ్మెల్యే శనివారం రిమ్స్ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, పలువురు డాక్టర్లతో కలిసి ఆస్పత్రిలోని జనరల్ వార్డ్, చిల్డ్రన్స్ వార్డు, తదితర వార్డులను తిరుగుతూ రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రికి ఎంతో నమ్మకంతో వచ్చే రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని రిమ్స్ డైరెక్టర్‌తోపాటు వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

నిబంధనలు సడలించాలి : ఎమ్మెల్యే



స్థానిక స్వప్న జిన్నింగ్‌లో పత్తి నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బోథ్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సీసీఐ అధికారులు పత్తి పంట నాణ్యత విషయంలో నిబంధనలను సడలించి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సీసీఐ అధికారులను ప్రభుత్వాన్ని కోరారు. వాస్తవానికి ఆదిలాబాద్ జిల్లాలో ముఖ్యంగా నల్లరేగడి భూములున్న బోథ్ నియోజకవర్గంలో నాణ్యమైన నల్లరేగడి భూములున్న బోథ్ నియోజక వర్గంలో నాణ్యమైన పత్తి వస్తుందన్నారు. అయితే రైతులు పండించిన పంటను కూలీల ద్వారా ఏరిపించి మార్కెట్‌కు తీసుకు వస్తున్నారన్నారు. అయితే చలికాలంలో పడే మంచు వల్ల తేమశాతం పెరిగి ఉంటుందన్నారు. వాస్తవానికి రైతులు పత్తి పంటపై నీళ్ళు చల్లారని అయితే సీసీ అధికారులు కొనుగోలు కొర్రీలు పెట్టవద్దన్నారు. రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాణ్యత పేరుతో రైతులను నిండా ముంచేదిగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే తేమశాతం తగ్గించేంత వరకు రైతులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సంధ్యారాణి, మండల పార్టీ కన్వీనర్ నారాయణరెడ్డి, ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్, జిల్లా పరిషత్ మాజీ కో-ఆప్షన్ సభ్యులు తాహెర్బిన్ సలాం, రమణ గౌడ్, భీమ బుచ్చన్న, డాక్టర్ స్వామి, రామ్‌రెడ్డి, సీసీఐ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం గొప్పది : ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 09 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సనాతన ధర్మం ఎంతో గొప్పదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఆదిలాబాద్‌కు చెందిన అయ్యప్ప స్వామి మాలధారులు ప్రశాంత్ రెడ్డి, వారి బృందం సభ్యులు శబరిమాలైకి పాదయాత్రగా వెళ్తున్నారు. ఈ పాదయాత్రలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు. ముందుగా ప్రత్యేక పూలు నిర్వహించి వారితో పాదయాత్రలు పాల్గొని సాగనంపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శబరిమలకు అయ్యప్ప స్వాములు పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు.

రైతుల గోస పట్టదా?

• బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



రుయ్యాడిలో బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

తలమడుగు , నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎంత చెప్పినా వారికి రైతుల గోస పట్టదని చెవిటోడి ముందు శంకు ఊదినట్లు ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని చర్లపల్లి, రుయ్యాడి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పత్తి పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యారన్నారు. వారికి పదవులు తప్ప ప్రజా సమస్యలు పట్టావన్నారు. మార్కెట్‌లో తేమ శాతం పేరిట రైతులను దళారులు దగా చేస్తున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అదే విధంగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఇవ్వడం లేదన్నారు. రైతు బంధు జాడ లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రెండు లక్షల రుణమాఫీ, రైతు బంధు డబ్బులు అందించాలని కోరారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, ముడుపు కేదారేశ్వర్‌రెడ్డి, రమాకాంత్, ప్రకాష్‌రెడ్డి, గంగాధర్, కిరణ్, ప్రవీణ్, తిరుమలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా పత్తి కొనుగోళ్లు చేయొద్దు

• జిల్లా మార్కెటింగ్ ఏడీ గజానంద్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కేంద్రానికి వచ్చిన అధికారి

ఆదిలాబాద్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి) :వ్యాపారులు లైసెన్స్ లేకుండా పత్తి కొనుగోళ్లను చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా మార్కెటింగ్ ఏడీ గజానంద్ అన్నారు. శనివారం ఆంధ్ర జ్యోతిలో ప్రచురితమైన దళారీదందాకు అధికారులు స్పందించారు. సిరికొండ మండలంలో అక్రమంగా సాగుతున్న పత్తికొనుగోళ్ల పై తనిఖీలు నిర్వహించారు. సీసీఐ నిబంధనల ప్రకారమే పత్తి కొనుగోళ్లు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో అధికారుల బృందాలు ఆకస్మిక తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. అక్రమంగా పత్తి కొనుగోళ్లు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : ఎమ్మెల్యే

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించి బీజేపీ సంస్థగత ఎన్నికల కార్యశాలలో ఆయన హాజరయ్యారు. కార్యకర్తలు నిరంతరం శ్రమిస్తూ క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేసినప్పుడు ఎన్నికల్లో విజయం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్, మయూర్ చంద్ర, ఆదినాథ్, విజయ్, వేణుగోపాల్, నగేష్, లాల మున్న పాల్గొన్నారు.

హాకీ విజేతలకు ఘనసన్మానం



హాకీ క్రీడాకారుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

తలమడుగు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బరంపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యూష అన్నారు. బరంపూర్ పాఠశాలకు చెందిన హాకీ క్రీడాకారుడు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతి సాధించడంతో తలమడుగు మండలం బరంపూర్ ఉన్నతపాఠశాలకు చెందిన క్రీడాకారుడు వంశీ, పీడీ రవీందర్ జాదవ్‌ను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న పోటీల్లో జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ముందుగా వీరిని గ్రామంలోని బస్టాండ్ నుంచి పాఠశాల వరకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష, గ్రామస్తులు కేదారేశ్వర్‌రెడ్డి, గంగారాం, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు మహేందర్ యాదవ్, వాణి, సంగీత, అమరేందర్, శశికళ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

షాట్‌పుట్‌లో నర్సాపూర్ బి. విద్యార్థుల ప్రతిభ

ఉట్నూర్, నవంబరు (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఉట్నూర్ మండల కేంద్రంలో నిర్వహించిన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలలో మండలంలోని నర్సాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాల బాలికల ఉత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల ఇన్‌చార్జీ హెచ్‌ఎం రాథోడ్ ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు షాట్‌పుట్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం పొందిన పాఠశాల విద్యార్థిని జోత్స్నకు శనివారం పాఠశాల ఆవరణలో అభినందించారు. అదే విధంగా శైలజ, ప్రియాంకలు 300 మీటర్ల పరుగు పందెంలో, 400 మీటర్ల పరుగు పందెం ఇలలో ద్వితీయ స్థానంలో నిలిచిన బాలికలను అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు సాగర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చింతగూడలో తెగిపడిన విద్యుత్ తీగ

బోథ్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతగూడ గ్రామ సమీపంలో పంట పొలాల్లో శనివారం విద్యుత్ తీగ తెగిపడటంతో పంట దగ్ధమైంది. లెవెన్ కే.వి. విద్యుత్ పడటం వల్ల షార్ట్‌సర్క్యూట్‌తో తీగ పడ్డ చోట దగ్ధమైంది. విద్యుత్ తీగ తెగిన సందర్భంలో పొలం పనులు ఎవరైనా ఉంటే ప్రమాదం సంభవించేదని స్థానికులు అంటున్నారు. కాగా విద్యుత్ తీగ తెగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు తీగను సరిచేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

తలమడుగు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తలమడుగు మండలం ఉండం గ్రామంలో దేవల్ల శంకరమ్మ ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయిందని, వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వపరంగా ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకుంటామని మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్, రామచందర్ దేశ్‌ముఖ్, పోతయ్య, మాజీసర్పంచ్ లక్ష్మన్న, మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ రఫీక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు డి.అశోక్, సురేందర్ ఉన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

● తహసీల్దార్ రాజమోహన్

తలమడుగు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. మండల కేంద్రంలో ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమగర సర్వేను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి గజానంద్ పాల్గొన్నారు.

బోథ్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటాపోటీ ర్యాలీలు



ర్యాలీగా తరలివస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే

బోథ్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడేగజేందర్ ఆధ్వర్యంలో దహనం చేశారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఎమ్మెల్యే దిష్టిబొమ్మను ఊరేగించిన అనంతరం బస్టాండ్‌లో దహనం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని దిష్టిబొమ్మ దహనంను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మూకుమ్మడిగా ఒకే చోట చేరి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలను బీఆర్ఎస్ వారు చింపివేయడం రౌడీయిజ మేనని విమర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొడ్డుగంగారెడ్డి, వైస్‌చైర్మన్ ఆడే వసంత్ ఉన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల వారు ర్యాలీలు నిర్వహించడంతో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది.

సంయమనం పాటించండి : ఎమ్మెల్యే

పార్టీ కార్యకర్తలు సంయమనం పాటించాలని ఎవరి ఫ్లెక్సీలను దగ్ధం చేయవద్దని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కొందరు ఇష్టానుసారంగా మాట్లాడటంతో పాటు ఫ్లెక్సీ దహనానికి పాల్పడటం జరుగుతుందన్నారు. త్వరలో బోథ్ మండల కేంద్రానికి ఫైర్ స్టేషన్ మంజూరవుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధినాయకులు కేటీఆర్ బోథ్ నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తల ఉత్సాహాన్ని పరిశీలిస్తున్నారని తాను రైతులకు అండగా ఉండాలన్న ఆలోచనతో సీసీఐ పత్తి కొనుగోలు ప్రారంభించేందుకు వెళ్లలేదని పేర్కొన్నారు. ఇక్కడి విషయాన్ని తెలుసుకున్న కేటీఆర్ తనను అభినందిస్తూ మెసెజ్ పంపించడం జరిగిందన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

బజార్‌హత్నూర్, నవంబరు 9 : ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని కొల్హారి గ్రామానికి చెందిన రావూఫ్ ఖాన్ రైతుకు చెందిన ఎద్దు విద్యుత్‌షాక్‌తో మృతిచెందింది. వ్యవసాయ క్షేత్రంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న విద్యుత్ తీగకు తగిలి మృతిచెందింది. సాయంత్రం సమయంలో ఎద్దును మేత మేసేందుకు చేన్లో వదిలి పెట్టగా అది మేత మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఉన్న గడ్డి మేసే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిందని బాధిత రైతు తెలిపారు. ఎద్దు విలువ 70,000 ఉంటుందన్నారు.

20న ఉట్నూర్‌లో తుడందెబ్బ మహాసభ

ఉట్నూర్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ భవన్‌లో ఈ నెల 20న తుడందెబ్బ జిల్లా మహాసభలు నిర్వహిస్తామని ఆదిలాబాద్ జిల్లా తుడందెబ్బ అధ్యక్షులు పురకబాపురావు తెలిపారు. శనివారం హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమా వేశానికి తుడందెబ్బ రాష్ట్ర కన్వీనర్ పొచయ్య అధ్యక్షతన తీర్మానం చేయడం జరిగిందన్నారు.

రంజీట్రోఫీలో జిల్లా క్రీడాకారుడి ప్రతిభ

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి)జిల్లా క్రికెట్ క్రీడాకారుడిగా రాణిస్తూ హైదరాబాద్ తరఫున రంజీ ట్రోఫీలో ఆడుతున్న కొడిమెల హేమతేజ తొలి సెంచరీ సాధించారు. రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆయన శతకం సాధించగా జిల్లా వాసులు, క్రీడాభిమానులు అభినందనలు తెలియజేశారు. కాగా జిల్లా నుంచి రంజీ ట్రోఫీకి తొలిసారి ప్రాతినిధ్యం వహిస్తున్న హిమతేజ అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్నారు. తాజాగా రంజీ ట్రోఫీలో సెంచరీ కొట్టడంతో ఆయన ఆటతీరు పై పలువురు ప్రశంసలు కురిపించడంతో పాటు సామాజిక మాధ్యమం ద్వారా అభినందనలు తెలియజేస్తున్నారు. కాగా పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన కొడిమెల మధుసూదన్, కామేశ్వరిల కుమారుడైన హిమతేజ రంజీ ట్రోఫికి ఎంపికవడమేకాకుండా ట్రోఫీ మొదటి నుంచి అద్వితీయ ప్రదర్శన కనబరుస్తున్నాడు. కాగా 7 ఇన్నింగ్స్‌లో 63.3 సరాసరితో 380 పరుగులు సాధించి అత్యధిక పరుగులు సాధించిన జాబితాలో 9వ స్థానంలో నిలిచాడు. గుజరాత్‌తో జరిగిన తన తొలిమ్యాచ్‌లో 66 పరుగులు, ఉత్తర్గాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో రెండవ మ్యాచ్‌లో 78, పుదుచ్చేరీతో జరిగిన మూడోమ్యాచ్‌లో 60 పరుగులతో అర్ధ సెంచరీలు చేసి రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 101 పరుగులు చేసి నాట్‌ఔట్‌గా హిమతేజ నిలిచి అద్భుత ప్రదర్శన కనబర్చాడు. కాగా కోచ్ జయేద్ర పటాస్కర్ ప్రోద్బలంతోనే తాను ఇంత స్థాయికి చేరుకోగలిగానని తెలిపారు.



101 పరుగులు చేసిన హిమతేజ

కళా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కళాకారులకు కొదవ లేదని, యువత సినిమా రంగంలో తమ కలను నిరూపించుకుంటూ ఉన్నత స్థానాలకు ఎదగాలని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. శనివారం యాదవ సంఘం భవనంలో నూతన సినిమా ప్రారంభోత్సవానికి క్లాప్ కిట్టి సినిమా ప్రారంభించారు. ఏబీ క్రియేషన్ ఆధ్వర్యంలో డైరెక్టర్ గాజుగౌడ్ దర్శకత్వంలో నిర్మిస్తున్న అనాథ ప్రేమ షూటింగ్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ యువత కళా నైపుణ్యానికి పదును పెడుతు చిత్ర పరిశ్రమల్లో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. చిన్నపాటి సినిమాలకు సైతం ఆదిలాబాద్ లోకేషన్‌లో ఆతిథ్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. యువతి యువకులు వారి నటన కళా నైపుణ్యాన్ని మెరుగు పరుచకుంటు సినిమా చిత్ర పరిశ్రమల్లో రాణించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, బట్టు సతీష్, చిన్నపటేల్, డైరెక్టర్ గజ్జుగౌడ్, భూపతి, నారాయణ్‌రెడ్డి, హీరో కళ్యాణ్, హీరో భీమేష్, హీరోయిన్ యోగితా, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

చిక్మాన్ ప్రాజెక్ట్ కాలువకు మరమ్మతులు

సిరికొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిక్మాన్ ప్రాజెక్ట్ కుడి సాగునీటి కాలువకు నీటిపారుదలశాఖ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో అధ్వానంగా సాగునీటి కాలువలు శీర్షికన ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా మంగళవారం చిక్మాన్ ప్రాజెక్ట్‌ను, కుడి సాగునీటి కాలువను నీటిపారుదల శాఖ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అధికారులు డీఈ భీంరావ్, జెఈ తిరుపతిలు పరిశీలించి అధ్వానంగా మారిన కుడి సాగునీటి కాలువకు గుత్తేదారు చేత తాత్కాలిక మరమ్మతులు చేపడతామన్నారు. రబీ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సకాలంలో రైతులకు సాగునీటిని అందించేలా చర్యలు చేపడుతున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఫ్లెక్సీ రాజకీయాలు తగవు

నేరడిగొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నేరడిగొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీ చించిన ఘటనకు నిరసనగా బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ దిష్టిబొమ్మను నేరడిగొండ క్యాంపు కార్యాలయం నుంచి ఊరేగించి అంబేద్క ర్‌చౌరస్తా వద్ద దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలు చింపడం రౌడీయిజమేనని, గతంలో ఫ్లెక్సీ రాజకీయాలు లేవని ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అహంకారంతో తన ఫ్లెక్సీలే తప్ప ఇతర ఫ్లెక్సీలు ఉండ కూడదన్న ఉద్దేశంతో ఫ్లెక్సీలు చింపడం జరిగిందన్నారు. ఇందులో మండల అధ్యక్షులు ఆడే వసంత్ రావు, బ్లాక్ అధ్యక్షులు అల్లూరు ప్రఫుల్ చందర్‌రెడ్డి పాల్గొన్నారు.


అవినీతి నాయకులపై చర్యలు

తలమడుగు , నవంబరు 9 (ఆం ధ్రజ్యోతి) :పది సంవత్సరాల బీఆర్ ఎస్ పార్టీ హయాంలో నాయకులు దళిత బంధు, డబుల్ బెడ్‌రూమ్‌లు ఇప్పిస్తామని అక్రమంగా వసూలు చేసిన నాయకులను రోడ్డుకు లాగుతామని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సుంకిడిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరంలో ప్రజల నుంచి టీఆర్ఎస్ పార్టీ నాయకులు దోచుకున్న అక్రమ సంపదను వెలికి తీస్తామన్నారు. అదేవిధంగా ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని బీఆర్ఎస్ నాయకులు చించివేయడం సమంజసం కాదన్నారు. బోథ్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారి అనుచరులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని చింపి వేయడాన్ని నిరసిస్తూ తలమడుగు మండలం సుంకిడిలో ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేశారు.

14న భైంసాలో ముథోల్ నియోజక వర్గ

కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం

● ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్



మంజూరి పత్రాలను పంపిణీ చేస్తున్న ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్

భైంసా, నవంబరు 9 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో ఈ నెల 14న నియోజక వర్గ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లుగా ముథోల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ తెలిపారు. శనివారం స్థానికంగా నియోజక వర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రొసిడింగ్ కాపీల పంపిణీ చేపట్టిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భైంసాలోని ఎస్‌అర్‌అర్ ఫంక్షన్ హాల్‌లో 14న మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించే పార్టీ సమావేశానికి ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జీ పి.విశ్వనాథ్ ముఖ్య అతిథిగా హాజరువుతున్నట్లుగా పేర్కొన్నారు.సమావేశంలో కుల గణన సర్వే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై దిశ,నిర్దేశం చేయడం జరుగుతుందని వివరించారు. నియోజక వర్గ పరిధిలోని పార్టీకి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, పాలక వర్గాల కార్యవర్గ ప్రతినిధులు, పార్టీ అన్ని విభాగాల ప్రతినిధులు, కార్యవర్గ ప్రతినిధులు,మహిళ సంఘాలు, పార్టీ శ్రేణులు సకాలంలో అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గౌడజన హక్కుల పోరాట సమితి నూతన కార్యవర్గ ఎన్నిక

మామడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గౌడజన హక్కుల పోరాట సమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కాగా మామడ మండలం న్యూ లింగంపల్లి గ్రామానికి చెందిన పాకాల చంద్రశేఖర్ గౌడ్‌ను జిల్లా గౌడ జన హక్కుల పోరాట సమితి కార్య నిర్వాహణ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈయన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా గత పది సంవత్సరాల నుండి కొనసాగుతున్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టినందుకు అంకిత భావంతో గౌడ సంఘం హక్కుల కోసం కృషి చేస్తానన్నారు.

'కుర్మలు సర్వేలో పాల్గొనాలి'

నిర్మల్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కుర్మలు కులస్తులు ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో పాల్గొని వివరాలు నమోదు చేయించుకోవాలని ఆ సంఘం ప్రచార కార్యదర్శి బి. శంకర్ ఒక ప్రకటనలో కోరారు. 7వ కాలంలో కురుమ కులం అని 25వ కాలంలో కులవృత్తి గొర్రెల కాపరి అని నమోదు చేసుకోవాలని సూచించారు.

విద్యుత్‌శాఖ అధికారుల పొలం బాట

రెబ్బెన, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన నంబాలో శనివారం విద్యుత్‌శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ ప్రమాదాలు జరిగే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు.

రాష్ట్రంలో బీజేపీ అధికారమే ధ్యేయంగా శ్రమించాలి

● సభ్యత్వ నమోదుపై కార్యశాలలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ప్రేమేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి



హాజరైన కార్యకర్తలు

నిర్మల్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలంటే కార్యకర్తలు విశేషకృషి చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని మారుతి ఇన్‌లో పార్టీ సభ్యత్వ సేకరణపై కార్యశాల నిర్వహించారు. నిర్మల్ ఎమ్మెల్యే బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు కే.అంజుకుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ... దేశంలో మూడోసారి బీజేపీ అధికారం చేపట్టి ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. దేశంలోని 21 రాష్ట్రాల్లో బీజేపీ కూటమి అధికారంలో ఉందన్నారు. త్వరలో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో అధికారంలోకి రానుందని జోస్యం చెప్పారు. దేశంలోనే బీజేపీ అతిపెద్ద పార్టీగా విస్తరించిందన్నారు. గత ఎంపీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ 76 లక్షల ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి 86 లక్షల ఓట్లు రాగా బీఆర్ఎస్ జీరో స్థానంలో నిలిచిందన్నారు. కార్యకర్తలు కష్టపడితే రాష్ట్రంలో మొదటి స్థానానికి రావడం ఏమంత కష్టం కాదన్నారు.

ఆదిలాబాద్ ఎంపీ స్థానంతో పాటు నలుగురు ఎమ్మెల్యేలు గెలుపొందడం పార్టీ పటిష్టతకు నిదర్శనమని అభినందించారు. తెలంగాణ రాష్ట్రంఒల బీజేపీ అధికారంలోకి రావాలంటే స్థానిక సంస్థల ఎన్నికలతోనే శ్రీకారం చుట్టాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పార్టీ సభ్యత్వ నమోదు లక్ష్యం చేరుకోవాలన్నారు. తద్వారా పార్టీ బలోపేతమవుతుందన్నారు. ఆ దిశగా ఎదగాలంటే ప్రతి మండలంలో 200ల మంది క్రియాశీల సభ్యత్వాలు ఉండాలన్నారు. పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్, ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, మేడిసెమ్మె రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే. మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు హరినాయక్, నారాయణరెడ్డి, సత్యనారాయణ గౌడ్, రాచకొండ సాగర్, కమల్ నయన్, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత మృతిపై విచారణ చేపట్టిన డీఎస్పీ గంగారెడ్డి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన కుమారస్వామి

దస్తురాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేవోజిపేట్ గ్రామానికి చెందిన సందలత అనే వివాహిత వరకట్నం వేధింపులకు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి శనివారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ గంగారెడ్డి రేవోజిపేట్ గ్రామానికి చేరుకొని మృతురాలి తల్లి పోగుల మల్లీశ్వరిని సంఘటనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. తన కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని మృతురాలి తల్లి డీఎస్పీకి వివరించగా, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి పోస్టుమార్టం నివేదిక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఆయన వెంట ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై శంకర్, తదితరులు ఉన్నారు.

వివాహిత మృతిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలి..

అత్తింటి వరకట్నం వేధింపులకు ఆత్మహత్య చేసుకున్న సంద లత మృతిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని మృతురాలి తల్లి పోగుల మల్లీశ్వరి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సమాయ కార్యదర్శి మాదన కుమార స్వామి ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా లతను ఆమె భర్త, అత్త మామలు అదనపు కట్నం కోసం వేధించారని అన్నారు. పథకం ప్రకారమే ఆమెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. ఇందులో పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరం అభినవ్, తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఆసిఫాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్మికశాఖ, సీఎస్ఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని లయన్స్‌క్లబ్ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తారీక్ తెలిపారు. లేబర్ గుర్తింపుకార్డు ఉన్న కార్మికు లకు ఉదయం 7నుంచి సాయంత్రం 4గంటల వరకు బీపీ, షుగర్‌తోపాటు 32రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

పాఠశాలల తనిఖీ

సిర్పూర్(యు), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన సంక్షేమశాఖ పాఠశాలలను శనివారం మహగాం స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు రాంబాయి తనిఖీ చేశారు. పాఠశాలలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులను పలువిషయాలు అడిగితెలుసుకున్నారు. విద్యార్థులకు సుల భంగా అర్థం అయ్యేవిధంగా బోధించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శనివారం పంపిణీ చేశారు. నిర్మల్ పట్టణం, గ్రామీణ, నియోజకవర్గంలోని సోన్, లక్ష్మణచాంద, దిలావర్‌పూర్, నర్సాపూర్, మామడ మండలాలకు చెందిన 289 మంది లబ్ధిదారులకు రూ. 2 కోట్ల 89 లక్షల విలువగల చెక్కులు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, గ్రంథాలయ చైర్మన్ అర్జుమన్ అలీ, ఏఎంసీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

● ప్రత్యేక అధికారి జాదవ్ అంబాజీ

లక్ష్మణచాంద, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి జాదవ్ అంబాజీ శనివారం అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, కుల గణన సర్వేను ఆయన మండలంలోని కనకాపూర్ గ్రామంలో ప్రారంభించారు. స్థానికంగా గల ఎన్యుమరేటర్లకు సర్వేపై పలు సలహాలు, సూచనలు అందజేస్తూ పై విధంగా స్పందించారు. అలాగే సర్వే ఫారాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధా రాథోడ్, ఎంపీవో అమీర్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

● సీపీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి కృష్ణారావు



ఖానాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీపీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి కృష్ణారావు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 2025 మార్చ్‌లో జరగబోయే ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల బరిలో తాను నిలువనున్నట్లు పేర్కొన్నారు. పోరాటాల ద్వారానే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని సాధించుకోవడం సాధ్యమవుతుందన్నారు. గతంలో అనేక పోరాటాలు చేసి గ్రాట్యూటీని, ఫ్యామిలీ పెన్షన్‌ను సాధించుకున్నామని అదే విధంగా భవిష్యత్తులో పాత పెన్షన్ విధానాన్ని సైతం సాధిస్తామన్నారు. తనను ఆదరిస్తే ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గఫార్, నాయకులు రాజేందర్, సుభాష్, ఉపాధ్యాయులున్నారు.

మీకోసం..



ఔత్సాహికుల కోసం.. ముద్ర!

- చిరు వ్యాపారులు, స్వయం ఉపాధి పొందే వారికే లాభం
- ముడు రకాలుగా ముద్ర రుణాల మంజూరు
- ప్రతీ భారతీయుడూ రుణం పొందేందుకు అర్హుడే..
- ప్రతీ జాతీయ బ్యాంకు ద్వారా అతి తక్కువ వడ్డీకి రూ.10 లక్షల వరకు రుణ సౌకర్యం
- కిందిస్థాయిలో అవగాహన లేని కారణంగా ప్రయోజనం పొందలేకపోతున్న చిరు, మధ్య తరహ వ్యాపారులు
- ఏప్రిల్ 8న 2015లో ముద్ర యోజన పథకాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ

నేరడిగొండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): 'మనదేశంలో ఔత్సాహిక పారిశ్రామిక శక్తి ఎంతో ఉందని నేను బలీయంగా విశ్వసిస్తున్నాను. దాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాల్సి ఉంది. ఆలా చేస్తే మనదేశం ఉద్యోగాలను అర్థించే దేశంగా ఉండే కన్నా ఉద్యోగాలను కల్పించే దేశంగా మారింది.' అని ముద్ర రుణాల ప్రాంభోత్సవాల సందర్భంగా దేశ ప్రధాని నరేంద్రమోదీ చెప్పిన మాటలు ఇవి. నిధుల కోసం ఇబ్బందులు పడే చిరు వ్యాపారులు, స్వయం ఉపాధి పొందే వారి కోసం మోదీ ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా ముద్ర (ప్రధాన మంత్రి మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ రీఫైనాన్స్ ఏజెన్సీ) యోజన కింద రుణాలను అందిస్తోంది. నిధుల కోసం ఇబ్బందులు పడే చిరు వ్యాపారులు, స్వయం ఉపాధి పొందే వారికి చేయూత నిచ్చేలా 8 ఏప్రిల్ 8న 2015లో ప్రధాని మోదీ ముద్ర యోజన పథకాన్ని ప్రారంభించారు. ముద్ర యోజన కింద తక్కువ వడ్డీకీ చిన్న వ్యాపారులు దాదాపు రూ.10 లక్షల వరకు ప్రతీ జాతీయ బ్యాంకు ఈ రుణాలని అందిస్తోంది. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాలపై కిందిస్థాయిలో అవగాహన లేమి కారణంగా వాటి ప్రయోజనాలను చిన్న, మధ్య తరహ పరిశ్రమల వ్యవస్థాపకులు అందుకోలేక పోతున్నారు.

రుణాలు అందుకున్న వారిలో మహిళలే ఎక్కువ

దేశంలో 58 మిలియన్‌ల నాన్ కార్పొరేట్ సంస్థలు, 128 మిలియన్ మందికి ఉద్యోగాలను కల్పిస్తున్నాయి. వాటిలో 60 శాతం గ్రామీణ ప్రాంతాలలో, 40 శాతం పైబడి వెనుకబడిన తరగతుల వారే ఉన్నారు. వీరిలో చాలా మందికి బ్యాంకు రుణాలు అందుబాటులో లేవు. అత్యధికంగా ఉపాధి అవకాశాలు అందిస్తున్న రంగానికి అతి తక్కువ స్థాయిలో రుణాలు అందుబాటులో ఉన్నాయి. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు ప్రభుత్వం ముద్ర రుణాలను, ముద్ర బ్యాంకులను ప్రారంభిం చింది. ముద్ర రుణాలు అందుకున్న వారిలో ఎక్కువగా మహిళలే ఉన్నారు. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి నేటి వరకు 15.56 కోట్ల మందికి రూ.7.23 లక్షల కోట్ల రుణాలను ప్రభుత్వం ముద్ర యోజన పథకం ద్వారా అందజేయడం గమనార్హం.

రుణం పొందేందుకు ఇవీ అర్హతలు

ప్రతీ భారతీయ పౌరుడు ఈ రుణాన్ని పొందవచ్చు. వ్యవసాయేతర రంగాలైన తయారీ, వాణిజ్యం, సేవా రంగాలలో 10 లక్షల రుపాయల వరకు ఈ రుణాన్ని అందిస్తారు. అన్ని ప్రయివేటు బ్యాంకులు, జాతీయ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు రుణాలను అందజేస్తాయి. అయితే, ముద్ర రుణాలు మూడు రకాలుగా అందిస్తారు. ఆందులో శిశు, కిశోర్, తరుణ్ వంటి రకాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. శిశు రుణం కింద రూ.50 వేలు, కిశోర్ రుణం కింద రూ.50 వేల నుంచి రూ. 5లక్షల వరకు, తరుణ్ రుణం కింద రూ.5 లక్షల నుంచి రూ. 10లక్షల వరకు రుణాన్ని పొందవచ్చు. పైన పేర్కొన్న బ్యాంకులలో వేటిలోనైనా సంబంధిత అధికారిని కలిసి, రుణం తీసుకోవాలను కుంటున్న వారి అన్ని అర్హత పత్రాలు, చిరునామాకు సంబంధించిన వివరాలు, నెలకొల్ప బోయో సంస్థతో పాటు వాటి వివరాలు అందజేసి రుణాన్ని పొందవచ్చు.





నేరడిగొండలో బ్యాంగిల్స్ జనరల్ స్టోర్ వ్యాపారి

భక్తి



శోభాయాత్రలో పాల్గొన్న మహిళా భక్తులు

వైభవంగా ఆయుత చండీ హోమం

- నిర్మల్‌లో ఘనంగా శోభాయాత్ర
- మంగళహారతులతో భారీగా హాజరైన మహిళలు
- పలువురు ప్రముఖుల ప్రత్యేక పూజలు

నిర్మల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నిర్మల్‌లో నిర్వహిస్తున్న ఆయుత చండీ హోమం అత్యంత వైభవంగా సాగుతోంది. ఈ వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం బోయవాడ దక్షిణముఖ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి చండీయాగం యాగశాల వరకు నిర్వహించిన శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. ఈ శోభాయాత్రకు మంగళహారతులతో మహిళలు భారీగా తరలివచ్చారు. ఈ ఆయుత చండీ యాగంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి, ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్ రెడ్డి సతీమణి వినోదమ్మ సహా పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జాతీయ పురస్కారం అందుకుంటున్న కల్లెడ అభిలాష్

మునిపెల్లి బాలుడికి జాతీయ పురస్కారం

లక్ష్మణచాంద, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన కల్లెడ అభిలాష్ జాతీయ పురస్కారం అందుకున్నారు. గ్రామానికి చెందిన కల్లెడ పవిత్ర, ప్రసాద్‌ల కుమారుడు అభిలాష్ తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, మాచిరాజు సాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కథల పోటీలలో పాల్గొని 'మంచి మనసు' అనే కథా సంపుటిని రాసినందుకు ఈ పురస్కారం లభించింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారం అందుకున్నారు. కాగా అభిలాష్ జగిత్యాల జిల్లాలోని ఏర్గట్ల మండలంలో గల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. జాతీయ పురస్కారం అందుకున్న అభిలాష్‌ను గ్రామస్థులతో పాటు పలువురు అభినందించారు.

దాహం తీర్చని తాగునీటి ట్యాంక్!

- ప్రజలకు తప్పని తిప్పలు



జర దేఖో!!

- నిరుపయోగంగా మారిన తాగునీటి ట్యాంక్

నర్సాపూర్(జి), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ ముందర తాగునీటి ట్యాంక్ నల్లా చెడిపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఈ ట్యాంక్ ద్వారానే హోటల్ యజమానులు, ప్రజలు, ప్రయాణికులు దాహం తీర్చుకుంటారు. అధికారులు స్పందించి వెంటనే విరిగిపోయిన నల్లా స్థానంలో కొత్త నల్లా బిగిస్తేనే సమస్య తీరుతుందంటున్నారు.

ఇథనాల్ పరిశ్రమ తరలిస్తేనే.. సర్వేకు సహకరిస్తాం

- స్పష్టం చేసిన దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామస్థులు
- ఒప్పించేందుకు వచ్చి వెనుదిరిగిన జిల్లా అధికార యంత్రాంగం

దిలావర్‌పూర్ రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలని వచ్చిన జిల్లా అధికార యంత్రాంగానికి దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామస్తులు గట్టి షాక్ ఇచ్చారు. దిలావర్‌పూర్-గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను ఇక్కడి నుండి తరలించాలని డిమాండ్ చేస్తూ ఏడాది కాలంగా ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చేస్తున్నారు. అధికారులు పట్టించుకోలేదు. ఇక ఆయా గ్రామాల ప్రజలు నాలుగు నెలలుగా రిలే నిరాహార దీక్షలు చేస్తూ నిరసన తెలుపుతున్నప్పటికీ అధికారుల్లో కదలిక రాలేదు.. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు నిర్ణయించారు. ప్రభుత్వం చేపడుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను బహిష్కరించాలని రెండు గ్రామాల ప్రజలు నిర్ణయం తీసుకున్నారు. సర్వేకు వచ్చిన అధికారులకు వివరాలు చెప్పకుండా సహాయ నిరాకరణ చేశారు. దీంతో జిల్లా అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. నిర్మల్ ఆర్‌డీవో రత్న కళ్యాణి, డీపీవో శ్రీనివాస్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఇతర అధికారులు, ఎంపీడీవో అరుణ రాణి, తహసీల్దార్ స్వాతి, ఏపీవో దివ్య రెడ్డి, ఏపీఎం సులోచన రెడ్డి తదితర అధికారులంతా గ్రామస్తులను ఒప్పించి సర్వేకు సహకరించేలా చేసేందుకు ఆయా గ్రామాలను సందర్శించారు. గ్రామాలకు వచ్చిన అధికార యంత్రాంగానికి ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. మీరెన్ని చెప్పినా ఇథనాల్ పరిశ్రమ ఇక్కడి నుంచి తరలించే వరకు సహకరించేది లేదని స్పష్టం చేశారు. ఆయా గ్రామాల ప్రజలను ఒప్పించేందుకు అధికారులు రకరకాల ప్రయత్నించారు. సంక్షేమ పథకాల బూచి చూపారు. అయినా ఆయా గ్రామాల ప్రజలు పట్టించుకోలేదు... ఏమిచ్చినా ఇవ్వకపోయినా పర్వాలేదన్నారు. మా దొక్కటే డిమాండ్ ఇథనాల్ పరిశ్రమను ఇక్కడి నుంచి తరలించాలి. ఆ తర్వాత అధికారులు మా గ్రామాలకు రావాలన్నారు. అంతేకాకుండా అప్పుడు మాత్రమే సహకరిస్తామని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. దీంతో అధికార యంత్రాంగం వెనుదిరిగి వెళ్లిపోయింది.



గుండంపల్లిలో అధికారులను అడ్డుకుంటున్న మహిళలు



అధికారులను ఊళ్లోకి రాకుండా ఊరి బయటే అడ్డుకుంటున్న గుండంపల్లి గ్రామస్థులు

- అధికారులను ఊర్లోకి రానివ్వని గ్రామస్తులు

దిలావర్‌పూర్ గ్రామస్థులతో మాట్లాడిన తర్వాత గుండంపల్లి గ్రామానికి చేరుకున్న అధికారులకు చుక్క ఎదురయ్యింది. అధికారులు వస్తున్నారన్న సమాచారంతో గ్రామస్తులంతా ఊరు బయటికి వచ్చేశారు. అధికారులను ఊళ్లోకి రానీయకుండా అడ్డుకున్నారు. తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఏడాది కాలంగా రాణి అధికారులు ఇప్పుడేందుకు వచ్చారంటూ నిలదీశారు. ఇథనాల్ పరిశ్రమను ఇక్కడి నుంచి తరలించాలకే మా ఊళ్లోకి రావాలని డిమాండ్ చేశారు. అప్పుడు మాత్రమే సర్వేకు సహకరిస్తామని, రాచ మర్యాదలు చేస్తామన్నారు. మీరెన్ని చెప్పినా వినేవారు ఎవ్వరు లేరని స్పష్టం చేశారు. గుండంపల్లి మహిళలంతా మూకుమ్మడిగా అధికారులను అడ్డుకున్నారు. ఊరి బయటనే మాట్లాడి అటునుంచి అటే అధికారులను పంపించారు.



ఆసుపత్రి పక్కన పిచ్చిమొక్కలు, దుర్గంధం



చేతి పంపు వద్దనే వంట పాత్రలు కడుగుతున్న మహిళలు

ఫొటో న్యూస్

లోపల ఇంపు.. బయట కంపు!!

అనారోగ్యంతో... బాధపడుతూ వచ్చే రోగులకు చికిత్సలు అందించి ఆరోగ్యవంతులుగా మారుస్తుంది ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి. కానీ ఆసుపత్రి ఆవరణలో చెత్తాచెదారంతో దుర్గంధం వెదజల్లుడంతో పరిసరాలకు వెళ్లిన వారిని అనారోగ్యానికి కూడా గురి చేస్తోంది. రిమ్స్‌కు వచ్చే వారు ఆవరణలోనే బట్టలు ఉతకడం, మెడికల్ వ్యర్థాలు, బయటి నుంచి వచ్చే చెత్తాచెదారంతో పరిసరాలు కంపుగా మారాయి. రోగాలతో బాధపడుతూ వెళ్లే వారే కాకుండా.. వారితో వెళ్తున్న సహాయకులు కూడా అనారోగ్యం బారీన పడాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దృష్టి సారించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చాలని కోరుతున్నారు.

(- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)



పైపుల నుంచి లీకవుతున్న నీరు, పక్కనే చెత్తాచెదారంతో ఉన్న దృశ్యం



చెత్తాచెదారం పక్కనే కూర్చున్న మహిళలు



ఆసుపత్రి ఎదుటే చెత్తాచెదారం వద్ద భోజనం చేస్తున్న మహిళ



తాగునీటి వద్దనే టిఫిన్ డబ్బాలు కడుగుతున్న వృద్ధురాలు

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.7 । కనిష్ఠం 19.5
నిర్మల్ జిల్లా వార్తలు
8
ఆదివారం 10 నవంబరు 2024



ధాన్యం వెనువెంటనే కొనుగోలు చేయాలి


ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ బృందం

సారంగాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం వెనువెంటనే కొనుగోలు చేయాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆలూర్‌లో డ్వాక్రా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాంరావు పటేల్‌లు సందర్శించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని విక్రయించడానికి కొనుగోలు కేంద్రానికి గత పదిహేను రోజుల క్రితం తీసుకవచ్చినప్పటికీ కొనుగోలు ప్రక్రియ ప్రారంభించకపోవడంతో ఆయన కొనుగోలు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పాటు వెంటనే అదనపు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి రేపటిలోగా ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. రైతులకు గన్ని బస్తాలతో పాటు ఇతర సౌకర్యాలను కొనుగోలు కేంద్రాల్లో కల్పించాలన్నారు. ఏజెన్సీలకు రైస్ మిల్లులు కేటాయించకపోవడంపై సంబంధిత అధికారులపై మండిపడ్డారు. జిల్లా పార్టీ అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, భూమయ్య, మాజీ మండల అధ్యక్షులు సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

దేవరకోట ఆలయంలో శ్రావణ నక్షత్ర వేడుకలు


స్వామివారి పూజలో పాల్గొన్న భక్తులు

నిర్మల్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కలియుగ వైకుంఠదైవం వెంకటేశ్వర స్వామి జన్మ శ్రావణ నక్షత్రాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. దేవరకోటలో శ్రావణ మాసంలో భాగంగా సాయంత్రం వికాస తరంగిణి ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణం, ప్రత్యేక ఆరాధన, అష్టోత్తర సహిత అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. గోవింద నామాలతో ఆలయం మార్మోగింది. దీపోత్సవాన్ని నిర్వహించారు. చైర్మన్ కొండా శ్రీనివాస్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు రేపటి నుంచి ప్రత్యేక తరగతులు : డీఈవో


నిర్మల్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పది విద్యార్థులకు ఈ నెల 11 సోమవారం నుండి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల యాజమాన్యాలు ప్రతీ రోజు సాయంత్రం 4:15 నుండి 5:15 వరకు తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం తరగతులను సమయానుసారంగా నిర్వహించాలన్నారు. వంద శాతం విద్యార్థులు హాజరయ్యేలా చూడాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులను దత్తత తీసుకోవాలని, వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి పునఃచరణ తరగతులు నిర్వహించాలని సూచించారు.

టూరిజం స్పాట్‌గా కవ్వాల్ టైగర్ జోన్



కడెం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో బోటుపై విహరిస్తున్న యాత్రికులు

» ఐదు సఫారీ వాహనాల ఏర్పాటు » 20 శాతం కోర్, బఫర్ ఏరియా కేటాయింపు » తడోబా తరహాలో యాక్షన్ ప్లాన్ » పీపీపీ పద్ధతిలో నిర్వహణ » ఏకో టూరిజం పేరిట రూట్ మ్యాప్ ఖరారు


కుంటాల వాటర్ ఫాల్ ఇదే

కవ్వాల్ అభయారణ్యంలోని పక్షులు

నిర్మల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని కొంత ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దేందుకు అటవీశాఖ కసరత్తు మొదలు పెట్టింది. తడోభా తరహాలో కవ్వాల్ టైగర్‌జోన్‌ను కూడా టూరి జం స్పాట్‌గా తీర్చిదిద్దాలని తలపెట్టారు. మొత్తం నిర్మల్, మంచిర్యాల జిల్లాల పరిధిలోని 78 వేల హెక్టార్లకు గాను ఇందులో నుంచి 20 శాతం మేర కోర్, బఫర్ ఏరియాలో మాత్రమే ఈ టూరిజం స్పాట్‌గాను ఏర్పాటు చేయను న్నారు. ఏకో టూరిజం పేరిట డీసీఎఫ్ కమిటీ నిర్ణయం మేరకు ఈ 20 శాతం ప్రాంతాన్ని ఎంపిక చేశారు. ఈ 20 శాతం కోర్, బఫర్ ఏరియాలో విపరీతమైన అటవీ ప్రాంతంతో పాటు సుందర ప్రదేశాలు, గడ్డి మైదా నాలు, వన్యప్రాణుల సంచారం ఎక్కువగా ఉంటుంది. అడవిలో సందర్శిం చేందుకు అనుకూలమైన ప్రదేశాలకు సంబంధించి ప్రత్యేక రూట్‌మ్యాప్ కూడా సిద్ధం చేశారు. అలాగే సందర్శకులు కవ్వాల్ టైగర్ జోన్‌ను చూసేం దుకు కోసం ప్రత్యేక సఫారీ వాహనాలను కూడా ఏర్పాటే చేయనున్నారు. మొత్తం 5 సఫారీ వాహనాలను సమకూర్చేందుకు తెలం గాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు సమకూరనుంది. అయితే ఈ టూరిజం స్పాట్ నిర్వహణను పీపీపీ (పబ్లిక్, ప్రైవేట్, పార్టిసిపేషన్) కింద నిర్వహించ నున్నారు. కడెం, గంగాపూర్, ఎక్బాల్‌పూర్, ఉడుంపూర్, కల్వకుంట్ల, ఆకొండపేట, గంగాపూర్ ప్రాంతాలను ఈ టూరిజం స్పాట్ పరిధిలోకి చేర్చారు. కడెం మండలంలోని ఉడుంపూర్ వద్ద గల ఐలవ్ కవ్వాల్ లోగో ప్రాంతం నుంచి మైసంపేట్, గంగాపూర్, లక్ష్మీపూర్, తదితర ప్రాంతాలను చూసేందుకు ప్రత్యేకంగా సఫారీని ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఎక్బాల్‌పూర్ వద్ద ప్రవేశమార్గాన్ని ఏర్పాటు చేయతలపెట్టారు. దీంతో పాటు టూరిస్టుల కోసం వసతి సౌక ర్యాన్ని కూడా కల్పించనున్నారు. దిమ్మదుర్తి వద్ద 12, జన్నారం వద్ద 10 చొప్పున కాటేజీలను నిర్మించాలని ప్రతిపాదించారు. అలాగే ఈ టూరిజం స్పాట్ కింద కడెం ప్రాజెక్టును కూడా కవర్ చేస్తున్నారు. కడెం ప్రాజెక్టు సమీపంలోని దాదాపు 550 మీటర్ల ఎత్తున గల గుట్టపైన ఇప్పటికే వాచ్ టవర్‌ను నిర్మించారు. టూరిస్టులను ఇక్కడి వరకు తీసుకెళ్లి కడెం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రాంతంతో పాటు దట్టమైన అడవులను వారికి చూపించ నున్నారు. ప్రస్తుతం అటవీశాఖ 50 ఎకరాల్లో ఇప్పటికే అందమైన గడ్డి మైదానాలను పెంచిన సంగతి తెలిసిందే. ఈ టూరిజం స్పాట్‌లో ఈ గడ్డి మైదానాలను కూడా చేర్చారు. మరో నెల రోజుల్లో మొత్తం ఈ టూరిజం స్పాట్‌కు సంబంధించిన పనులన్నీ పూర్తి కానున్నాయని ఆ తర్వాత సందర్శకులను అనుమతించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ రూట్ మ్యాప్‌కు అనుగుణంగా ఇప్పటికే సఫారీ వాహనాలు తిరిగేందు కోసం రోడ్ల నిర్మాణాలను కూడా పూర్తి చేశారు. టైగర్ కన్జర్వేషన్ ప్లాన్ పేరిట ఏకో టూరిజం కోసం ఈ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. అయితే ఈ టూరిజం స్పాట్ నిర్వహణ మాత్రం పీపీపీ పద్ధతి కింద చేపట్టనుండగా ప్రత్యేక చెక్‌పోస్టుల వద్ద మాత్రం అటవీశాఖ ఎంట్రీ ఫీజు వసూలు చేయనుంది. కవ్వాల్ టైగర్ జోన్ విశేషాలు వివరించేందు కోసం ప్రత్యే కంగా గైడ్లను కూడా నియమించనున్నారు.

20 శాతం కోర్, బఫర్ ఏరియా కేటాయింపు

కాగా కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని 80 వేల హెక్టార్లకు గాను ఇందులో నుండి 20 శాతం కోర్, బఫర్ ఏరియాను మాత్రమే టూరిజం స్పాట్ కోసం కేటాయించారు. కడెం నుంచి మొదలుకొని గంగాపూర్, ఎక్బాల్‌పూర్, ఉడుంపూర్, మైసంపేట, లక్ష్మీపూర్, కల్వకుంట్ల, ఆకొండపేట, దిమ్మదుర్తి తదితర ప్రాంతాల్లోని కోర్, బఫర్ ఏరియాల్లో గల 20 శాతం ప్రాంతాన్ని ఇప్పటికే కేటాయించారు. దీని కోసం గాను ఈ అటవీ గ్రామాలన్నింటినీ కలుపుతూ ప్రత్యేక రూట్ మ్యాప్ తయారు చేసి టూరిస్టుల కోసం రోడ్డును కూడా ఏర్పాటు చేశారు. దట్టమైన అడవుల గుండా ప్రయాణించేందు కోసం సఫారీ వాహనాలను కూడా సమకూరుస్తున్నారు. ఈ అడవుల్లో ఇప్పటికే గడ్డి మైదానాలను పెంచడంతో వన్యప్రాణుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. అడవిలోని ప్రకృతి సౌందర్యం దృశ్యంతో పాటు నీటి కొలనులు, చిన్న చిన్న జలపాతాలు, మృగాలు టూరిస్టులను విపరీతంగా ఆకర్షించనున్నాయంటున్నారు. సఫారీ వాహనంలో టూరిస్టులు పర్యటించే సమయంలో వారికి అన్ని రకాల సౌకర్యాలతో పాటు భద్రత చర్యలు కూడా చేపట్టనున్నారు. అలాగే ఇక్కడి ఎత్తైన గుట్టపైకి వెళ్లి అక్కడ నిర్మించిన వాచ్ వాటర్ ద్వారా కడెం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో పాటు కవ్వాల అభయారణ్యాన్ని చూసే అవకాశం కల్పిస్తున్నారు.

పీపీపీ పద్ధతిలో నిర్వహణ

ఏకో టూరిజంలో భాగంగా కవ్వాల్ టైగర్ జోన్‌ను టూరిస్ట్ స్పాట్‌గా ఏర్పాటు చేస్తున్న క్రమంలో ఈ టూరిజం నిర్వహణ అంతా అటవీశాఖ పీపీపీ పద్ధతిలో చేపట్టబోతుంది. టైగర్‌జోన్ పరిధిలోని గ్రామాలకు చెందిన వీడీసీలు, అలాగే అక్కడి యువకులు సఫారీ వాహనాల నిర్వహణను చేపట్టే విధంగా చర్యలు తీసుకోనున్నారు. ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈ వాహనాల కొనుగోళ్లకు సహకరించనున్నప్పటికీ స్థానిక యువకులకు రుణాలు అందించి ఈ వాహనాలను అప్పజెప్పనున్నారు. గైడ్ల నియామకం కూడా స్థానికులకే అప్పజెప్పనున్నారు. ఇక్కడి అడవి జంతువుల వివరాలు, చెట్ల రకాల ప్రత్యేకతలను టూరిస్టులకు స్థానిక యువకులు వివరించే అవకాశం ఉంటుండడంతో వారినే గైడ్లుగా నియమించనున్నారు. మొత్తం టూరిజం స్పాట్ పరిధిలోని పర్యవేక్షించే బాధత అటవీశాఖ చేపట్టబోతోంది.

హైకోర్టు న్యాయమూర్తికి పరామర్శ


పరామర్శిస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు న్యాయమూర్తి కూచాడి శ్రీదేవి శ్రీహరిరావు దంపతులను జిల్లాకు చెందిన పలువురు నాయకులు శనివారం పరామర్శించారు. న్యాయమూర్తికి ఇటీవల పితృ వియోగం కలిగింది. తండ్రి సూర్యారావు అనారోగ్య కారణాలతో మృతి చెందారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

నర్సాపూర్(జి), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆశ్రమ హాస్టల్‌లో విద్యార్థిని విద్యార్థులకు బస్టాప్‌లలో, రద్దీ ప్రదేశాలలో గుర్తు తెలియని వ్యక్తుల నుండి జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న డిజిటల్ అరెస్టులు అనగా సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేసి తాము పోలీసులమని, దర్యాప్తు అధికారులమని నమ్మించి తల్లి దండ్రులను మీ పిల్లలు కేసులో దొరికారని ఇప్పుడు డబ్బులు పంపిండి లేదంటే జైలుకు పంపుతామని భయపెట్టి మోసం చేస్తున్నారు. కావునా గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్‌కి దూరంగా ఉండాలని పలు సూచనలు ఎస్సై హన్మాండ్లు చేశారు. అలాగే ఏఎస్సై శంకర్, కానిస్టేబుళ్లు కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు



అమరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగించాలని మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కే. రాజన్న పిలుపునిచ్చారు. శనివారం అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా అమరులకు ఘన నివాళులర్పించారు. కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుల సంస్మరణ సభలో మాట్లాడుతూ... ప్రజల కోసం పోరాటం చేసి తమ అమూల్యమైన ప్రాణాలు అర్పించి అమరులైన వారి త్యాగాలు వెలకట్టలేనివన్నారు. దేశం కోసం మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానాలతో దోపిడీ వ్యవస్థ నిర్మూలనకు కృషి చేశారన్నారు. రైతాంగ పోరాటాలు జరిగాయన్నారు. నాయకులు రాజు, మురళి, చిన్నయ్య, రాజు, గంగాధర్, లక్ష్మి, గంగామణి, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే ప్రక్రియ నిబద్ధతతో చేయాలి

కలెక్టర్ అభిలాష అభినవ్


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అధికారులు

నిర్మల్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక సమగ్ర సర్వే ప్రక్రియ నిబద్ధతతో పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్ శాంతి కుమారి, ప్రత్యేక కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో కలిసి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరయ్యారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... ఈ మహోన్నత కార్యక్రమంలో అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. దేశ యావత్తు తెలంగాణ రాష్ట్రాన్ని గమనిస్తోందన్నారు. సమగ్ర సర్వే దేశానికి మార్గదర్శనం కానుందని తెలిపారు. ఎమ్మెల్యేలు, మంత్రులను ఆహ్వానించాలన్నారు. అనంతరం సమగ్ర సర్వేపై చేసిన సూచనలు కలెక్టర్ అధికారులకు వివరించారు. ఎలాంటి అనుమానాలు, సందేహాలకు తావు లేకుండా ప్రజల నుండి ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియను సూపర్‌వైజర్లు, మండల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ జరుపాలని స్పష్టం చేశారు. సర్వేకు ముందు రోజు గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజల నుండి సేకరించిన సమాచారం గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఎలాంటి అపోహలకు తావు లేకుండా సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జ్ డీఆర్‌వో రత్నకల్యాణి, సీపీవో జీవరత్నం, డీపీవో శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు రాజేశ్వర్‌గౌడ్, శంకర్, అంబాజీ, శ్రీనివాస్, మోహన్‌సింగ్, రాథోడ్ సుదర్శన్, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజలంతా సహకరించాలి

నిర్మల్ అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేపై వివిధ శాఖల అధికారులతో చర్చించామని ఈ సర్వే పూర్తిగా ప్రభుత్వపరంగా చేపడుతుందని, సర్వే ఆధారంగా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయబడతాయన్నారు. కావునా సర్వేలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కొన్ని గ్రామాలలో సర్వేను బహిష్కరించడం సరికాదని, జిల్లాలో రాజకీయ, వివిధ కారణాలతో సర్వేను బహిష్కరించిన, అడ్డుకునే ప్రయత్నం చేసిన సంబంధిత వారిపై కఠినచర్యలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వే ఏ రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, సర్వేపై ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా ప్రజలందరూ సర్వేలో తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. ప్రజలకు భవిష్యత్తులో సామాజిక, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించేందుకు ఈ సర్వే వివరాలు దోహదపడతాయన్నారు. సర్వేపై ఎటువంటి సందేహాలున్నా క్షేత్రస్థాయిలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వే వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని, ఎన్యుమరేటర్లకు, సర్వే సిబ్బందికి ప్రజలు సరైన సమాచారం అందించి సహకరించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

సోన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం నిర్మల్ రూరల్ మండలంలోని కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే అన్ని పోలింగ్‌బూత్‌లలో బూత్‌స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటరు నమోదు, పేరు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉన్నట్లయితే తమ అభ్యంతరాలను అధికారులకు ఆధారాలతో తెలుపవచ్చునన్నారు. జనవరి 01.2025 నాటికి 18 ఏళ్లు నిండబోవు యువతి యువకులు ఫారంనెంబర్ 6తో ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చునన్నారు. కొత్తగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేయుటకు ఫారం-6, ఓటరు జాబితాలో అభ్యంతరాలకు ఫారం-7, జాబితాలో మీ చిరునామా సవరణలు చేయుటకు ఫారం-8 ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అంతకు ముందు పాఠశాలను పరిశీలించి, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని అధికారులకు, ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. త్రాగునీరు అందించాలని, మరుగుదొడ్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో రత్న కళ్యాణి, బూత్ స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి అల్లోల



సారంగాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల చించోలి(ఎం) మాజీ సర్పంచ్ ప్రకాష్ రెడ్డి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాన్ని శనివారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ అట్ల మహిపాల్ రెడ్డి, సొసైటీ చైర్మన్ మాణిక్ రెడ్డి, నాయకులు పఠాని భూమేష్, పాకాల రాంచందర్, ధర్మాజీగారి రాజేందర్, భాస్కర్ మల్లయ్య, లక్ష్మణ్, గజానంద్, మల్లయ్యలతో పాటు నాయకులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

భైంసా రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేగాం గ్రామంలో ద్యారంగుల హన్మంతు శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ద్యారంగుల హన్మంతు తరచుగా మద్యం తాగుతూ ఆర్థిక ఇబ్బందులకు గురై శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ వెల్లడించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని పేర్కొన్నారు.

సొనారి గ్రామంలో దొంగతనం



కుభీర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోనారి గ్రామంలో శనివారం వేకువ జామున దొంగతనం జరిగినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సొనారి గ్రామానికి చెందిన సూర్యవంశీ దేవానంద్ శుక్రవారం తన ఇంటికి తాళం వేసి మండలంలోని బెల్గాం గ్రామంలో తమ బంధువుల శుభకార్యానికి వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చే సరికి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ. 45వేల నగదు, 5గ్రాముల బంగారం మొత్తం రూ. 70 వేల వరకు చోరి జరిగినట్లు ఎస్సై తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై రవీందర్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

నేడు మెగా ఉచిత వైద్య శిబిరం

లక్ష్మణచాంద, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునిపెల్లి గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు, శ్రీ ఆదిత్య సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, స్వర్ణ ఆసుపత్రి నిర్వాహకురాలు అయిండ్ల స్వర్ణ రెడ్డి శనివారం తెలిపారు. ఈ శిబిరం ద్వారా అవసరమైన వారికి ఫ్రీ కన్సల్టేషన్‌తో ఈసీజీ, 2డిఈకో పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు మందులు కూడా ఉచితంగా అందజేయబడునని తెలిపారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు ప్రమోద్ చంద్రారెడ్డి, జగన్నాథం, శశాంక్‌రెడ్డి, మానస, వసు కుమార్, కిరణ్, అన్వేష్, గిరీష్, తదితరులు ఉంటారని కావునా గ్రామస్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.